చెప్పాడాయన.

"అదేమిటి స్వామీ? శతృవులని నాశనం చేయకపోతే మనకే ఆపద కదా?" ప్రశ్నించాడు రాజు.

"మనం ఏ కర్మ చేస్తే దాని ప్రతిఫలం పొంది తీరాలి. నువ్వు వాళ్ళని ద్వేషించినంత కాలం వాళ్ళూ నిన్ను ద్వేషించడంతో వాళ్ళు హీన జన్మలకి వెళ్తారు. కాబట్టి మనం వారిని ఆ జన్మలకి వెళ్ళకుండా కాపాడగలిగితే, వాళ్ళకి మంచి జన్మలు రావడంతో బాటు ఆ సుకర్మ ఫలితంగా మనం మోక్షాన్ని అందుకుంటాం. నువ్వు ఈ దేశం రాజువు కాబట్టి పొరుగు దేశాల మీదకి దండెత్తి వెళ్ళక." చెప్పాడు ఆ మహాత్ముడు.

శతృగూఢచారులు కూడా తనని గుర్తుపట్టరు. అలాంటిది తను రాజుని గుర్తు పట్టి తనకి ఉపయోగించే ప్రవచనం చెప్పిన ఆయన నిజంగా మహాత్ముడని రాజు గ్రహించాడు.

## 150. సాటివారికి సాయం

ఓ ధనవంతుడు బుద్ధుడి దగ్గరకి వచ్చి నమస్కరించి చెప్పాడు.

"స్వామీ! నా దగ్గర చాలా ధనం ఉంది. నేను సాటి మానవులకి సేవ చేయాలనుకుంటున్నాను. అందుకు నాకు చాలా ఆలోచనలున్నాయి. కాని మీ సలహా కోరి వచ్చాను. ఇతరులకి నేను ఎలా సహాయం చేయగలనో చక్కటి మార్గాన్ని బోధించవలసిందిగా కోరుతున్నాను."

బుద్ధుడు మౌనంగా ఉండిపోయాడు.

సమాధానం రాకపోవడంతో కాసేపాగి ఆ ధనవంతుడు అడిగాడు.

"జవాబు చెప్పవే స్వామీ?"

"నువ్వు సాటి మానవులకి సహాయం చేయబోయే ముందు మనిషిగా నిన్ను నువ్వు తీర్చిదిద్దుకో. ఆ తర్వాత నా దగ్గరికి రా." చెప్పి బుద్ధుడు కళ్ళు మూసుకున్నాడు.